తెలంగాణ భవన్‌లో నిర్వహించిన నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ బీఆర్ఎస్ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో ఎంపీ బడుగుల, ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, కడియం శ్రీహరి, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నిరంజన్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, భగత్, భాస్కర్‌రావు, సైదిరెడ్డి, రవీంద్రకుమార్, మల్లయ్యయాదవ్, పార్టీ నాయకులు

హామీలు అమలయ్యేదాకా వదలం

మొదటిపేజీ తరువాయి...

తెలంగాణభవన్‌లో సోమవారం నిర్వహించిన నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ సన్నాహక సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు

నియోజకవర్గ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 9న ఆదిలాబాద్‌తో ప్రారంభమైన పార్లమెంట్ నియోజకవర్గ సన్నాహక సమావేశాలు నల్లగొండతో ముగుస్తున్నాయని చెప్పారు. మొత్తం 17 లోక్‌సభ నియోజకవర్గాల సమావేశాలు పూర్తవుతున్నాయని తెలిపారు. పార్టీకి కార్యకర్తలే కథానాయకులని, కార్యకర్తల వల్లే ఇన్నేండ్లుగా పార్టీ బలంగా ఉన్నదని చెప్పారు. గత 16 సమావేశాల తీరు చూస్తే కార్యకర్తలే పార్టీకి ధైర్యం చెప్పారని అన్నారు. నల్లగొండలో ఎన్నికల ప్రచార సరళి మనకు అనుకూలంగా ఉన్నట్టే అనిపించింది కానీ ఎక్కడా ఓటమిపై అనుమానాలు రాలేదని పేర్కొన్నారు. కానీ ఎన్నికల ఫలితాలు మరోలా వచ్చాయని అన్నారు. సూర్యాపేటలో మాత్రమే గెలిచామని, పార్టీకి ప్రభుత్వానికి సమన్వయం లేకపోవడంవల్లే ఇలాంటి పరిస్థితి ఎదురైందని కార్యకర్తలు అభిప్రాయపడుతున్నట్టు చెప్పారు. ఓటమికి అనేక కారణాలున్నాయని, ఈ పార్లమెంటు సన్నాహక సమావేశాలు ఆరంభమాత్రమేనని తెలిపారు. ఫిబ్రవరి మొదటివారం నుంచి అసెంబ్లీ నియోజకవర్గాలవారీగా సమీక్షలు మొదలవుతాయని వెల్లడించారు. సోషల్ మీడియాలో జరిగిన అసత్య ప్రచారాన్ని మనం గట్టిగా తిప్పికొట్టలేకపోయామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అభూత కల్పనలు, అబద్ధాలతో ప్రజలను తప్పుదోవ పట్టించిందని అన్నారు.

సర్కారు వైఫల్యాలను ఎండగట్టాలి

మనం ఇంకా మాట్లాడటం మొదలు పెట్టనే లేదు.. కాంగ్రెస్ వాళ్లు ఉలిక్కిపడుతున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. కేసీఆర్ అసెంబ్లీకి వస్తే ఇంకెలా ఉంటుందో ఊహించుకోండి అని కాంగ్రెస్‌నుద్దేశించి వ్యాఖ్యానించారు. అధికారంలోకి వస్తామని కాంగ్రెస్ పార్టీ ఊహించలేదని, అందుకే ఇష్టమొచ్చినట్టు హామీలు గుప్పించిందని తెలిపారు. ఇప్పుడు అమలుచేయలేక హామీలకు పంగనామాలు పెట్టే ప్రయత్నం చేస్తున్నదని దుయ్యబట్టారు. హామీల నుంచినీ నెరవేర్చేదాకా వారిని వదిలిపెట్టొద్దని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో గెలిచేందుకు రేవంత్‌రెడ్డి అడ్డమైన మాటలు మాట్లాడారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలు ఉదాసీన వైఖరి, మీమాంస వీడాలని, ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలు ఏం మాట్లాడారో ఇపుడేం చేస్తున్నారో ప్రజలకు విడమరచి చెప్పాలని, ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని సూచించారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గత నవంబర్‌లోనే కరెంటు బిల్లులు కట్టవద్దని చెప్పారని, నల్లగొండ ప్రజలు బిల్లులు కట్టకుండా ఆయనకే పంపాలని తెలిపారు. సాగర్ ఆయకట్టుకు కాంగ్రెస్ పాలనలో మొదటిసారి క్రాప్ హాలిడే ప్రకటించే దుస్థితి దాపురించిందని మండిపడ్డారు. కాంగ్రెస్ సర్కారు కృష్ణా రివర్ బోర్డుకు ప్రాజెక్టులను అప్పగించి తెలంగాణ జుట్టును కేంద్రం చేతిలో పెడుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎస్సారెస్పీ చివరి ఆయకట్టును కాంగ్రెస్ ప్రభుత్వం ఎండబెడుతున్నదని మండిపడ్డారు. అప్పుడే కరెంట్ కోతలు కూడా మొదలయ్యాయని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ అక్రమ బంధం నల్లగొండ మున్సిపాలిటీ అవిశ్వాసంలో బయటపడిందని చెప్పారు. 'రేవంత్ భుజం మీద తుపాకీపెట్టి మోదీ బీఆర్ఎస్‌ను కాల్చే ప్రయత్నం చేస్తున్నారట.. మైనారిటీ సోదరులకు కాంగ్రెస్, బీజేపీ అక్రమ సంబంధం గురించి చెప్పాలి' అని కేటీఆర్ కార్యకర్తలకు సూచించారు. కేసీఆర్‌పై ప్రజల్లో సానుభూతి వెల్లువలా ఉన్నదని, కాంగ్రెస్‌కు ఇప్పటికే అనేక వర్గాలు దూరం అయ్యాయని తెలిపారు. ఈ పరిస్థితిని పార్లమెంటు ఎన్నికల్లో అనుకూలంగా మలచుకోవాలని సూచించారు. నల్లగొండ పార్లమెంట్ ఎన్నికల్లో సమష్టిగా పనిచేసి గులాబీ జెండాను ఎగురవేద్దామని పిలుపునిచ్చారు. కాగా, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని కేటీఆర్ సోమవారం గుత్తా ఇంట్లో మర్యాదపూర్వకంగా కలిశారు. సుఖేందర్‌రెడ్డితోపాటు ఆయన కుమారుడు గుత్తా అమిత్‌కుమార్‌రెడ్డితో పలు అంశాలపై చర్చించారు.

కాంగ్రెస్‌తో బీజేపీ కుమ్మక్కు: జగదీశ్‌రెడ్డి

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ కలిసి పనిచేశాయని మాజీ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి మండిపడ్డారు. కేసీఆర్ బీఆర్ఎస్ పేరిట దేశవ్యాప్తంగా తిరిగితే బలోపేతం అవుతారని భయపడిన మోదీ కాంగ్రెస్‌కు సహకరించారని ఆరోపించారు. రాహుల్‌ను ఎదుర్కోవడం కన్నా కేసీఆర్‌ను ఎదుర్కోవడం కష్టమని మోదీ అనుకున్నారని, అందుకే బీజేపీ ఓట్ల పద్ధతిగా కాంగ్రెస్‌కు మళ్లించారని అన్నారు. బండి సంజయ్‌ను బీజేపీ అధిష్ఠానమే తప్పించిందని, ఆయనను తప్పించడంలో కేసీఆర్ పాత్ర ఉన్నదని దుష్ప్రచారం చేశారని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు పిల్లర్ కుంగిపోతే కేంద్రం నుంచి అధికారులు హుటాహుటిన వచ్చి తప్పుడు రిపోర్టు ఇచ్చారని తెలిపారు. కాంగ్రెస్‌కు మేలు చేసేందుకే ఇలా చేశారని జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఆ రెండు జాతీయ పార్టీలు బీఆర్ఎస్‌ను ఎదుర్కొనేందుకు కలిసి పనిచేస్తాయని అన్నారు. ఈ కుట్రను బీఆర్ఎస్ కార్యకర్తలు ఎండగట్టాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమం చేసిన పార్టీ మనదని, ఆ ఉద్యమంలో ఇపుడు పదోశాతం శక్తితో పోరాడినా కాంగ్రెస్‌ను నిలువరించవచ్చని తెలిపారు. ప్రభుత్వాన్ని నడపడం కాంగ్రెస్ వల్ల కాదని ఆ పార్టీ నేతలు చేస్తున్న ప్రకటనలే రుజువు చేస్తున్నాయని చెప్పారు. సమావేశంలో మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ స్పీకర్లు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎస్. మధుసూదనాచారి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మెడలు వంచుదాం

- తల్లిలాంటి బీఆర్ఎస్‌ను కాపాడుకుందాం
- ఉద్యమకారులకు సముచిత స్థానం: మాజీ మంత్రి టీ హరీశ్‌రావు

హైదరాబాద్, జనవరి 22 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ మెడలు వంచాలంటే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని మాజీ మంత్రి హరీశ్‌రావు పిలుపునిచ్చారు. కాంగ్రెస్-బీజేపీ కుమ్మక్కు రాజకీయాలను ఎండగడదామని అన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ గోబెల్స్‌ను మించి దుష్ప్రచారం చేసిందని, ప్రచారంలో అబద్ధం.. పాలనలో అసహనం.. ఇదే ఆ పార్టీ తీరు అని విమర్శించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ సన్నాహక సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎండ్రికాయల పార్టీ అని, ఒకరి కాలు ఇంకొకరు పట్టి లాగుతుంటారని ఎద్దేవా చేశారు. ఆ పార్టీది ఇచ్చే గుణం కాదని, ఎగవేసే గుణమని ఆరోపించారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల్లోని 13 హామీలను మరో 20 రోజుల్లో నెరవేర్చాలని, లేకుంటే పార్లమెంట్ ఎన్నికల కోడ్ వచ్చే అవకాశం ఉన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. కోడ్ పేరు చెప్పి తప్పించుకునే అవకాశం ఉన్నదని అనుమానం వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలను అమలుచేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తునే ఉంటామని తెలిపారు. కేసీఆర్ హయాంలో ఎస్సారెస్పీ చివరి ఆయకట్టు దాకా నీళ్లిచ్చామని గుర్తుచేశారు. మంత్రి కోమటిరెడ్డి బీఆర్ఎస్‌ను ముక్కలు చేస్తామనటం కాదు, కేఆర్ఎంబీలో చేరేందుకు రెండు నెలల్లోనే ఈ ప్రభుత్వం ఎందుకు సంతకం పెట్టిందనే దానిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సన్నాహక సమావేశాల్లో కార్యకర్తలు మంచి సూచనలు చేశారని, పార్టీకి ద్రోహం చేసినవారిపై చర్యల కోసం డిమాండ్లు వచ్చాయని వివరించారు. సంస్థాగతంగా పార్టీ బలోపేతంపై సూచనలు వచ్చాయని, గతంలో చేసిన పొరపాట్లు చేయకుండా ముందుకు సాగుదామని అన్నారు. కష్టపడ్డ వారికి, ఉద్యమకారులకు పార్టీలో సముచిత స్థానం ఇస్తామని భరోసా ఇచ్చారు. త్వరలోనే పార్టీ కమిటీలు వేసుకుని, అసెంబ్లీ నియోజకవర్గాలలో సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. అభిప్రాయ భేదాలుంటే పక్కనబెట్టి టీంలా పనిచేయాలని పార్టీ నేతలకు సూచించారు. తల్లిలాంటి పార్టీని కాపాడుకుందామని పిలుపునిచ్చారు.

లోకం పోకడ



ఎటూ తోచట్లేదు రామా! మేము అయోధ్యకు వచ్చినా పార్టీకి నష్టమే, రాకున్నా నష్టమే.. ఏదో ఒకదారి చూపి మమ్మల్ని గట్టెక్కించు తండ్రీ!

'వ్యూహం' సెన్సార్ సర్టిఫికెట్ రద్దు

చిత్రం విడుదలకు హైకోర్టు సింగిల్ జడ్జి బ్రేక్

హైదరాబాద్, జనవరి 22 (నమస్తే తెలంగాణ): దర్శకుడు రాంగోపాల్‌వర్మ రూపొందించిన వివాదాస్పద చిత్రం 'వ్యూహం' విడుదలకు బ్రేక్ పడింది. ఈ చిత్రానికి సెంట్రల్ ఫిలిం సర్టిఫికేషన్ బోర్డు (సీబీఎఫ్‌సీ) ఇచ్చిన సెన్సార్ సర్టిఫికెట్‌ను హైకోర్టు రద్దు చేసింది. బోర్డు రివైజింగ్ కమిటీ సమర్పించిన నివేదికను పరిశీలించిన తర్వాత జస్టిస్ సూరేపల్లి నంద సోమవారం ఈ మేరకు తీర్పు వెలువరించారు. ఈ నేపథ్యంలో ఈ చిత్రాన్ని మరోసారి చూసి మూడు వారాల్లోగా తగిన నిర్ణయం తీసుకోవాలని కమిటీని ఆదేశించారు. దీంతో ఈ తీర్పుపై ద్విసభ్య ధర్మాసనాన్ని ఆశ్రయించేందుకు 'వ్యూహం' చిత్ర నిర్మాత సిద్ధమవుతున్నారు.

చలి వణుకు

	కనిష్ఠం	గరిష్ఠం
రంగారెడ్డి	17.0°c	34.1°c
ఆదిలాబాద్	17.0°c	30.3°c
నల్లగొండ	18.0°c	33.5°c
మెదక్	18.4°c	33.5°c
వరంగల్	19.0°c	31.0°c
హైదరాబాద్	19.6°c	30.6°c
నిజామాబాద్	20.9°c	31.1°c
ఖమ్మం	21.0°c	31.0°c
కరీంనగర్	21.0°c	32.0°c
మహబూబ్‌నగర్	22.6°c	33.0°c

నిపుణ

విద్య, ఉద్యోగ సమాచారం

ఈఎస్ఐసీలో...

హైదరాబాద్‌లోని ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ)లో కాంట్రాక్టు ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 148
- పోస్టులు: ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, సూపర్ స్పెషలిస్ట్, సీనియర్ రెసిడెంట్స్
- ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా
- వెబ్‌సైట్: https://www.esic.gov.in

ఐసర్‌లో..

బెర్హంపూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐసర్)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 6
- పోస్టులు: సూపరింటెండెంట్ ఇంజినీర్, జూనియర్ సూపరింటెండెంట్
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: మార్చి 5
- వెబ్‌సైట్: www.iiserbpr.ac.in

సిద్దిపేట జిల్లాలో...

సిద్దిపేట జిల్లాలో కాంట్రాక్టు ప్రాతిపదికన పల్లె దవాఖానల్లో మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 10
- పోస్టులు: మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్
- అర్హతలు: ఎంబీబీఎస్/ బీఎస్సీ (నర్సింగ్), జీఎన్ఎం ఉత్తీర్ణత
- దరఖాస్తు: ఆఫ్‌లైన్‌లో
- చివరితేదీ: జనవరి 24
- వెబ్‌సైట్: https://siddipet.telangana.gov.in

ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- పాలిటీ, హిస్టరీ (గ్రూప్స్) కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

మారేది పేరే.. పోర్టల్ కాదు!

- ధరణిపై కాంగ్రెస్ అవాకులు చవాకులు
- బంగాళాఖాతంలో విసిరేస్తామన్న నేతలు
- అది అసాధ్యమని తేలడంతో పేరు మార్పుతో సరిపెట్టే యోచనలో సర్కారు
- 'భూమాత'గా పేరు మార్పునకు కసరత్తు

హైదరాబాద్, జనవరి 22 (నమస్తే తెలంగాణ): 'మేం అధికారంలోకి రాగానే ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో కలిపేస్తాం. భూమాత పేరుతో కొత్త పోర్టల్‌ను తీసుకొస్తాం'.. ఎన్నికల ప్రచారంలో రేవంత్‌రెడ్డి సహా ముఖ్యనేతలంతా చేసిన ప్రచారం ఇది. నిజానికి అలా విసిరేయడం అసాధ్యమని అప్పుడే వారికి తెలిసింది. అధికారంలోకి వచ్చాక ఇప్పుడు మరింత స్పష్టంగా అర్థమవుతున్నది. కాబట్టే, అవసరమైన మార్పుచేర్పులు చేసి పేరును 'భూమాత'గా మార్చాలని ప్రభుత్వం ఓ నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది. 'ధరణి పునర్నిర్మాణ కమిటీ' పేరుతో ఇటీవల ఏర్పాటైన కమిటీ కూడా పోర్టల్‌లో అవసరమైన మార్పు చేర్పులు మాత్రమే సూచిస్తుందని సమాచారం. పోర్టల్‌ను పటిష్టతకు అధ్యయనం చేస్తున్నట్టు సోమవారం కమిటీ సభ్యులు ప్రకటించారు. ప్రభుత్వానికి త్వరలోనే మధ్యంతర నివేదిక సమర్పిస్తామని తెలిపారు.

మళ్లీ వెనక్కి వెళ్లలేం

ప్రస్తుత డిజిటల్ యుగంలో అవసరాలకు అనుగుణంగా ధరణి పోర్టల్‌ను నిర్మించారని, దీనిని రద్దు చేసి మళ్లీ పాత పద్ధతికి వెళ్లలేమని నిపుణులు ప్రభుత్వానికి స్పష్టం చేసినట్టు సమాచారం. కొత్త పోర్టల్ కోసం సాఫ్ట్‌వేర్ తయారీ, డాటా అప్‌లోడ్, సర్వర్లు, నిర్వహణ.. ఇలా ఎంతో శ్రమతోపాటు ఖర్చు కూడా తడిసి మోపెడవుతుందని చెప్పినట్టు తెలిసింది. ఒకవేళ కొత్త పోర్టల్ తెచ్చినా 'కొత్త సీసాలో పాత సారా' మాదిరిగా మళ్లీ ధరణి నుంచే డాటాను అనుసంధానం చేయాలని స్పష్టం చేసినట్టు సమాచారం. ఒకవేళ కొత్త డాటా కావాలంటే రికార్డుల ప్రక్షాళన తరహాలో రాష్ట్రమంతటా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి, వచ్చిన సమాచారాన్ని మళ్లీ డాటా ఎంట్రీ చేయాల్సి ఉంటుందని, అప్పుడే పూర్తిగా కొత్త పోర్టల్ తయారవుతుందని వివరించినట్టు సమాచారం. కాబట్టి ఇదంతా అసాధ్యమని, ఉన్న పోర్టల్‌లోనే మార్పులు చేస్తే చాలని సూచించినట్టు చెప్తున్నారు. ఆంధ్రప్రదేశ్ తరహాలో రాష్ట్రం మొత్తం సమగ్ర సర్వే చేసి, పక్కా రికార్డులు రూపొందించడం, లేదా కర్ణాటక మాదిరిగా లావాదేవీలు జరిగిన ప్రతిసారి సర్వేతో డిజిటలైజ్ చేసి రికార్డులను అప్‌డేట్ చేయడం వంటివి చేపట్టాలని అభిప్రాయపడ్డట్టు తెలిసింది. ధరణిలో క్రయవిక్రయాల విధానం అద్భుతంగా ఉన్నదని, క్షణాల్లోనే భూ హక్కుల మార్పిడి జరిగి, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ జరగడం దేశంలోనే ఉత్తమంగా ఉన్నదని నిపుణులు స్పష్టం చేసినట్టు సమాచారం.

లేఔట్‌లో మార్పులు

ప్రస్తుతం ధరణి పోర్టల్‌ను ఓపెన్ చేయగానే 'అగ్రికల్చర్' పేజీ కనిపిస్తుంది. దానిని క్లిక్ చేస్తే కొత్త పేజీ ఓపెన్ అవుతుంది. ఇందులో ఎడమవైపు ట్రాన్సాక్షన్ మాడ్యూల్స్ ఉంటాయి. ప్రస్తుతం 35 ఉన్నాయి. కుడివైపు 10 ఇన్ఫర్మేషన్ మాడ్యూల్స్ కనిపిస్తాయి. మాడ్యూల్స్‌లో మార్పులు, చేర్పులు చేసే సమయంలోనే ఈ లేఔట్‌లో మార్పులు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిసింది. మొదటి పేజీలోనే మూడు లేదా నాలుగు బటన్లు ఏర్పాటు చేయాలని భావిస్తున్నారట. 'సర్వీసెస్' పేరుతో క్రయవిక్రయాల మాడ్యూల్స్ అన్నీ ఒకే చోటికి చేర్చాలని, 'గ్రీవెన్స్' పేరుతో దరఖాస్తుల స్వీకరణకు సంబంధించిన మాడ్యూల్స్‌ను కలపాలని, 'ఇన్ఫర్మేషన్' పేరుతో ఇన్ఫర్మేషన్ మాడ్యూల్స్ అన్నీ ఒకే గొడుగు కిందికి తేవాలని, ఇతర మాడ్యూల్స్, ఆప్షన్లను 'అదర్స్'లో చేర్చాలని యోచిస్తున్నట్టు తెలిసింది. ప్రస్తుతం ఉన్న ఆకుపచ్చ రంగుకు బదులుగా కాంగ్రెస్‌ను గుర్తు చేసేలా రంగులు మార్చాలని, పేరును కూడా 'భూమాత'గా మార్చి కొత్తగా లాంచ్ చేయాలని ప్రాథమికంగా నిర్ణయించినట్టు సమాచారం.

కోమటిరెడ్డి తాత తరం కాదు

- తెలంగాణ ఉన్నంత వరకు బీఆర్ఎస్ ఉంటది
- నువ్వో, నీ బాసో మరో ఎక్‌నాథ్ షిండేనే
- ప్రగల్భాలు మాని పాలనపై దృష్టి పెట్టండి
- పాలన చేతకాకపోతే తప్పుకోండి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే జీ జగదీశ్‌రెడ్డి

తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి. చిత్రంలో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, గాదరి కిశోర్, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్

హైదరాబాద్, జనవరి 22 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్‌ను ముక్కలు చేయడం కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తాత తరం కూడా కాదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జీ జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ఉన్నంత కాలం బీఆర్ఎస్ ఉంటుందని చెప్పారు. కోమటిరెడ్డి చిల్లర వేషాలు, ప్రగల్భాలు మానుకొని, పాలనపై దృష్టి పెట్టాలని సూచించారు. కాంగ్రెస్ నేతలకు పాలన చేత కాకుంటే తప్పుకోవాలని సూచించారు. ఎన్నికల హామీల నుంచి తప్పించుకునేందుకు ఇలాంటి రాజకీయ, వివాదస్పద వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. సోమవారం ఆయన తెలంగాణభవన్‌లో ఎంపీ లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, గాదరి కిశోర్, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్‌తో కలిసి మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌ను అంతం చేయడం చంద్రబాబు, వైఎస్సార్ వల్లనే కాలేదని గుర్తుచేశారు. కోమటిరెడ్డో, ఆయన బాస్ (రేవంత్ రెడ్డో) ఎవరో ఒకరు ఏకానాథ్ షిండే అవుతారని ఎద్దేవా చేశారు. ఇందులో భాగంగానే ప్రధాని మోదీని కలిసి మాట్లాడుకున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ నేతలు ఎన్నికల ప్రచారంలో కరెంటు బిల్లులు కట్టొద్దని చెప్పింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. మంత్రి కోమటిరెడ్డిని కోవర్టు అని కాంగ్రెస్ నేతలే అంటారని, ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన తన తమ్ముడికి ఓట్లేయమని చెప్పలేదా? అని ప్రశ్నించారు.

యూరియా కోసం క్యూలైన్లు

యూరియా కోసం రైతులు క్యూలైన్‌లో చెప్పులు పెట్టే పాత రోజులు మళ్లీ వచ్చాయని జగదీశ్‌రెడ్డి విమర్శించారు. నీళ్ల లేవు, కరెంటు లేదని ప్రజలు తమను అడుగుతున్నారని, ప్రతిపక్షంగా ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన బాధ్యత తమపై ఉన్నదని చెపారు. రైతుబంధు ఇంకా రాకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారని, ఫోన్‌లో మెసేజ్ సౌండ్ వస్తే రైతుబంధు పైసలే అనుకుని ఆశగా చూసి, నిరాశ చెందుతున్నారని పేర్కొన్నారు. కృష్ణా జిల్లాల్లో తెలంగాణకు అన్యాయం జరుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు.

బురదజల్లుడే కాంగ్రెస్ పని

- ఆ పార్టీ నేతలవి చిల్లర చేష్టలు
- బీజేపీ హేమాహేమీలంతా బీఆర్ఎస్ చేతిలోనే ఓడిపోయారు
- వచ్చే నెల తొలి వారంలో అసెంబ్లీ నియోజకవర్గాల భేటీలు: నిరంజన్‌రెడ్డి
- సీఎంకు పరిణతి లేదు: మధుసూదనాచారి

మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదనాచారి

హైదరాబాద్, జనవరి 22 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ 420 హామీలు అమలు చేయకుండా గత ప్రభుత్వం మీద బురదజల్లడమే పనిగా పెట్టుకున్నదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేల దాకా అదేవిధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సోమవారం ఆయన తెలంగాణభవన్‌లో లోక్‌సభ నియోజకవర్గాలవారీగా బీఆర్ఎస్ సన్నాహక సమావేశాలు ముగిసిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. బీజేపీ నేత బండి సంజయ్ కూడా కాంగ్రెస్‌తో కలిసి బీఆర్ఎస్‌ను కనుమరుగు చేద్దామని అంటున్నారని, బీజేపీ హేమాహేమీలుగా చెప్పుకునే వారంతా బీఆర్ఎస్ చేతిలోనే ఓడిపోయారని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు ప్రత్యేక నోటిఫికేషన్లు విడుదల చేయడమే కాంగ్రెస్, బీజేపీ మైత్రికి నిదర్శనమని చెప్పారు. బీఆర్ఎస్ నేతల మీద, ఇండ్ల మీద దాడులు, ఇండ్ల ముందు బాంబులు కాల్చడం వంటి చిల్లర చేష్టలకు కాంగ్రెస్ నేతలు పాల్పడ్డారని ఆరోపించారు. కాంగ్రెస్ నేతలు గ్రామస్థాయిల్లో బీఆర్ఎస్ కార్యకర్తలపై చేస్తున్న భౌతికదాడులు, దౌర్జన్యాలు, వెకిలిచేష్టలు వారి దిగజారుడు తనానికి, అపరిపక్వతకు అద్దంపడుతున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ శ్వేతపత్రాలకు దీటుగా బీఆర్ఎస్ విడుదల చేసిన స్వేదపత్రంపై ప్రజల్లో విస్తృతంగా చర్చ జరిగేలా చూడాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలంగాణ వాదాన్ని వినిపిస్తూ ప్రజల హక్కులను కాపాడేది బీఆర్ఎస్ మాత్రమేనని స్పష్టంచేశారు.

మొదటి వారంలో నియోజకవర్గ సమావేశాలు

పార్లమెంటరీ నియోజకవర్గ సన్నాహక సమావేశాల్లో కార్యకర్తలు, నేతలు నిస్సంకోచంగా, నిర్భయంగా సూచనలు ఇచ్చారని నిరంజన్‌రెడ్డి తెలిపారు. 16 పనిదినాల్లో సుమారు 125 గంటలపాటు సమీక్షా సమావేశాలు నిర్వహించినట్టు చెప్పారు. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సగటున 70 నుంచి 100 మంది చొప్పున నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారని వివరించారు. పార్టీ అధినేత కేసీఆర్‌తో చర్చించి ఆయన సూచనల మేరకు అసెంబ్లీ నియోజకవర్గాలవారీగా సమీక్షా సమావేశాల షెడ్యూల్‌ను రూపొందిస్తామని, వచ్చే నెల మొదటివారంలో ఈ సమావేశాలు ఉంటాయని తెలిపారు. రాముడు అందరివాడు అని, తమ హృదయాల్లో, తమ పేర్లల్లో కొలువైన వాడు, నెలువైన వాడు అని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. కేసీఆర్ హయాంలోనే యాదగిరిగుట్ట ఆలయాన్ని అత్యద్భుతంగా పునర్నిర్మించామని గుర్తుచేశారు.

పరిణతి లేని సీఎం రేవంత్: మధుసూదనాచారి

సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి వెంకట్‌రెడ్డి బీఆర్ఎస్‌పై చేస్తున్న వ్యాఖ్యలు వారి భయానికి, అసహనానికి నిదర్శనమని మాజీ స్పీకర్ మధుసూదనాచారి పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి మాదిరిగా ఇంత పరిణతి లేని ముఖ్యమంత్రిని ఎప్పుడూ చూడలేదని చెప్పారు. అడ్డగోలు కూతలతో తన స్థాయిని దిగజార్చుకున్నారని మండిపడ్డారు. వీరికి కాలమే బుద్ధి చెప్తుందని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎం.. గల్లీ లీడర్‌లా మాట్లాడొద్దు

ఎన్నారై బీఆర్ఎస్ యూకే కార్యదర్శి సతీశ్‌రెడ్డి హితవు

హైదరాబాద్, జనవరి 22 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డి విదేశాల్లో పర్యటిస్తున్నప్పుడు రాజకీయాలకు అతీతంగా ప్రసంగించాలని, గల్లీలీడర్‌లా మాట్లాడం తగదని ఎన్నారై బీఆర్ఎస్ యూకే కార్యదర్శి సతీశ్‌రెడ్డి గొట్టెముక్కల హితవు పలికారు. హైదరాబాద్ గాంధీభవన్‌లో, గల్లీ కాంగ్రెస్ మీటింగ్‌లో మాట్లాడినట్టు చిల్లర రాజకీయ విమర్శలు చేయడంపై రేవంత్ క్షమాపణ చెప్పాలని సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో లండన్ పర్యటనకు వచ్చిన మాజీ మంత్రి కేటీఆర్ ఎంతో హుందాగా ప్రసంగించి ఎన్నారైల్లో స్ఫూర్తి నింపారని గుర్తు చేశారు. సీఎం హోదాలో లండన్ వచ్చిన రేవంత్‌రెడ్డి.. సోయి లేకుండా కాంగ్రెస్ పార్టీ మీటింగ్‌లా మాట్లాడటం విడ